క్లుప్తంగా

రోడ్ల మరమ్మతులు చేపట్టండి


ఆర్‌అండ్‌బీ కార్యదర్శి ప్రద్యుమ్నకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాఘవేంద్రుడి దర్శనార్థం మంత్రాలయం వచ్చిన రోడ్లు, భవనాల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నను గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చేనేతపై జీఎస్టీ రద్దుచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుచేయాలని రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘ కార్యదర్శి ఎంఆర్ శ్రీనివాసులు, స్థానిక వైడబ్ల్యూసీఎస్ చైర్మన్ బండ నాగరాజులు కోరారు. చేనేతపై జీరో జీఎస్టీ ఉద్యమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ కార్యాలయం వద్ద నాయకులు ప్లకార్డులు చేతబట్టి నిరసనతెలిపారు.

చీటీల పేరుతో మోసం

మద్దికెర: నెలలు గడిచినా చీటీలు వేసిన సొమ్ము నిర్వాహకుడు చెల్లించకపోవడంతో గురువారం బాధితులు లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. మద్దికెరకు చెందిన ఫకృద్దీన్ వద్ద దాదాపు 60 మంది తమ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని భావించి చీటీలు వేశారు. గడువు ముగిసినా నగదు చెల్లింకుండా కాలయాపన చేస్తుండడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. బాధితులు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో పైసా పైసా కూడబెట్టి దాచుకుంటే ఇలా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మెనూ పాటించాలి

నందవరం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల విద్యాధికారి సుదర్శన్ రెడ్డి వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. గురువారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఎంపీపీ స్కూల్‌లో నాడు– నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం శివరాం ఆధ్వర్యంలో పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. స్కూల్ చైర్మన్ వీరేష్ ఉన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో ఫాతెహాలు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు రాత్రి దర్గా ఆవరణలో నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిజిగితాతా దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించగా దర్గాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

అసాంఘిక చర్యలపై నిఘా

చిప్పగిరి: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చిప్పగిరి ఎస్‌ఐ మల్లికార్జున పేర్కొన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమ మద్యం, పేకాట, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఘనంగా ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో ఉసేనప్ప స్వామి ఉరుసు గురువారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద ఎత్తున దర్గాను సందర్శించి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

శ్రీవారి దర్శనానికి పయనం

పత్తికొండ రూరల్: తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దివ్యదర్శనం కోసం మండల పరిధిలోని హోసూరు గ్రామ ఎస్సీ, ఎస్టీలు గురువారం ఉచిత బస్సులో బయల్దేరి వెళ్లారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బనవనూరు, కుంకునూరు, హోసూరు నుంచి 49 మంది భక్తులు తరలివెళ్లినట్లు బస్సు ఇన్‌చార్జ్ బ్రహ్మయ్య తెలిపారు.

రేషన్ సక్రమంగా అందించండి

మద్దికెర: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐడీసీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం స్థానిక సాయినగర్‌లో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీడీయూ ఆపరేటర్లు, డీలర్లు కొలతలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎంపీటీసీ గద్దల ఆంజనేయులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఎమ్మిగనూరుటౌన్: పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బనవాసి కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త అపర్ణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ సెక్టార్– 2లో పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమం


వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం


ఆలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంక్షేమం వెల్లివిరుస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం దేవనకొండ మండలంలోని పొట్లపాడు గ్రామంలో సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం గ్రామంలో ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.4 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు మంత్రి వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో అత్యవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమ పాలనను ఓర్వలేక టీడీపీ నేతలు వారికి పట్టిన ఖర్మను ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నించడం దారుణం అన్నారు. అధికార దాహంతోనే వారు చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిదేవి, లుముంబ, జెడ్పీటీసీ రామకృష్ణ, తహసీల్దార్ సుదర్శనం, ఎంపీడీఓ గౌరీ దేవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మహారాజు సీఎం జగన్

గత ప్రభుత్వ పాలనలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు పడిన బాధలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వారికి ఆ బాధల నుంచి విముక్తి కల్పిస్తూ ప్రతినెలా 1వ తేదీన పింఛను సొమ్మును ఇంటి వద్దకే పంపుతూ మనసున్న మహారాజుగా నిలిచాడని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం ఆలూరులోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకటించి తేదీలవారీగా అమలుచేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ శ్రీరాములు, నాయకులు వీరేశ్, హనుమయ్య, ఎంపీడీఓ అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

ఆలూరు: ఎన్నో ఏళ్ల నుంచి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జగనన్న భూ హక్కు–భూరక్ష పథకం ద్వారా రీసర్వే చేపట్టారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం దేవనకొండ మండలంలోని పొట్లపాడు, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లో పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ సమక్షంలో రైతులకు భూహక్కు పత్రాలు అందించారు. మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని పనిని సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సమస్యలు పరిష్కరించడం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా భూములను సర్వే చేయించి మ్యాపులతో హక్కు పత్రాలు అందించడం సంతోషకరమన్నారు. పొట్లపాడులో 3,467.43 ఎకరాల విస్తీర్ణానికి గాను 2,338.72 ఎకరాలకు, మొత్తం 874 భూ ఖాతాలు ఉండగా 777 ఖాతాలకు సర్వే పూర్తయ్యిందన్నారు. తిమ్మాపురం గ్రామంలో 1,811 ఎకరాల భూములకు గాను 918.27 ఎకరాలకు విస్తీర్ణం చూపి 175 ఖాతాలకు క్లియరెన్స్ ఇచ్చారన్నారు. తహసీల్దార్ సుదర్శనం, ఏఓ సురేష్ బాబు, ఎంపీడీఓ గౌరీ దేవి, సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నందవరం: గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఉపాధి పనులు చేపట్టాలని, కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఉపాధి పనులకు ప్రభుత్వం రోజువారీ గరిష్ఠ కూలీ రూ.257 కల్పించిందన్నారు. పనికి తగ్గ వేతనం లభిస్తుందని, దీనిపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఈ నెల 16వ తేదీన నిర్వహించే సామాజిక తనిఖీకి రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రికార్డులు పూర్తి చేయాలని తెలిపారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలన్నారు. ఏపీఓ మాలిక్‌బాషా, ఈసీ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి చూపాలి

కృష్ణగిరి: వలసలు నిర్మూలించేందుకు కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎక్కువ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలని ఏపీఓ అబ్దుల్‌షకూర్‌కు సూచించారు. అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలన్నారు. ఈసీ శేషిరెడ్డి, అన్ని గ్రామాల టీఏలు, ఎఫ్‌ఏలు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో ఆర్థిక భరోసా


ఎమ్మిగనూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల: ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్మును విడతల వారీగా పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 చేయడంతో అవ్వాతాతలకు ఆర్థిక భరోసా కలిగిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఉప్పర కళ్యాణ మండపంలో గురువారం 261 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే పింఛను సొమ్మును రూ.3 వేలు చేస్తారని వివరించారు. వృద్ధాప్యంలో ఆసరాలేని వారికి పింఛను సొమ్ము ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సంక్షేమ పథకాలతో అన్నివర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఏకైన సీఎం వైఎస్ జగన్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం జన్మభూమి కమిటీలను ఆశ్రయించి వారికి లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హత ఉంటే పింఛను సొమ్ము ఇంటి వద్దకే తెచ్చిస్తున్నారని గుర్తుచేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని పథకాలు నిలిచిపోతాయని అవినీతి, అక్రమాలు పెరిగిపోతాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో 330 మందికి కొత్త పింఛన్లు

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. గోనెగండ్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. మండలంలో 330 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ టీ.నసురుద్దీన్, ఎంపీడీఓ, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వేణుగోపాల్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, నాయకులు నాగేష్ నాయుడు, కాశీరెడ్డి, ఎస్‌బీ మన్సూర్, బందెనవాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర సందర్భంగా పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం పురస్కరించుకొని పట్టణంలో ఈనెల 8వ తేదీ నుంచి వైఎస్సార్ కబడ్డీ పోటీలు, 9వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి వృషభాల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయా పోటీల పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. రైతుసంఘ నాయకుడు సోగనూరు భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పోటీల వివరాలను వెల్లడించారు. సీనియర్ సైజు వృషభాల బలప్రదర్శన పోటీల్లో మొదటి ఐదు స్థానాలకు రూ. లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆరుపళ్ల సైజు వృషభాల పోటీలో రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, నాలుగు పళ్ల సైజు వృషభాల పోటీలో రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, న్యూ కేటగిరీ వృషభాల పోటీలో రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను విజేతలకు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.వెయ్యి ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99665 39912,78160 35554 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈ నెల 8వ తేదీ నుంచి జరిగే వైఎస్సార్ అంతర్రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. అలాగే ఈనెల 11, 12 తేదీల్లో జరిగే మహిళా కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. పురుషుల జట్టుకు రూ.1000, మహిళా జట్టుకు రూ.500 ఎంట్రీ ఫీజు ఉంటుందని వివరాలకు 73869 15560, 90003 88483 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


ముగతిలో పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, సర్పంచ్ విరుపాక్షిరెడ్డి

నందవరం: పాదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. గురువారం ముగతి గ్రామంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మానవాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం, ఆదాయాభివృద్ధి పెంపొందించేందుకు పెరటి కోళ్లను అందించామన్నారు. మహిళలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలన్నారు. అనంతరం గ్రామంలో పాదుపు మహిళలకు 100 యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు సునీత, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆస్పరి: మండల పరిధిలోని చిగిలి గ్రామంలో శుక్రవారం, ములుగుందం గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య గురువారం తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వెల్దుర్తి: కలుగొట్ల గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు తెలిపారు. అంతకు ముందు రామళ్లకోటలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

పీహెచ్‌సీ తనిఖీ

తుగ్గలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆరోగ్య సర్వేలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యాధికారి ప్రవీణ్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హొళగుంద: ఏఐఎస్‌ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆ సమితి జిల్లా సభ్యుడు పెద్యాట శ్రీరంగ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డేవిడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శ్రీరంగ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ కృషి చేస్తోందన్నారు. ఆయా సంఘాల నాయకులు ఎల్లార్తి అర్జున్, పెద్యాట వీరేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: కురువ సామాజిక వర్గానికి చెందిన క్యాలెండర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కనకదాసు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కురువలు రాజకీయంగా ఎదగాలన్నారు. ఆదర్శంగా ఉంటూ తమకు తోచిన సహాయ సహకారాలు అందించాలన్నారు.

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి

పత్తికొండ రూరల్: బీసీలు రాజ్యాధికారం కోసం సంఘటితంగా పోరాటాలు చేయాలని శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేంద్ర, పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప పేర్కొన్నారు. గురువారం పత్తికొండలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. బీసీ సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

చిప్పగిరి: సదరం సర్టిఫికెట్ పొందేందుకు శుక్రవారం నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ కార్యక్రమం మార్చి వరకు కొనసాగుతుందన్నారు. అర్హులైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తారని వివరించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎరుకుల కాలనీలో భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయ అవరణలో పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా ఎరుకల కాలనీలో కేద్రిరాణి ఇంటి పక్కన ఉన్న కాపౌండ్‌లో 30 బాక్సుల్లో 2880 (90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు కనిపించాయన్నారు. రూ. 1.50 లక్షల విలువైన వీటిని స్వాధీనం చేసుకొని, ఎరుకుల నాగమ్మ, కేద్రిరాణిలను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సీఐతో పాటు సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్ రావు, హెడ్‌కానిస్టేబుళ్లు రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, అశ్వర్థరెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

మద్యం కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని అనంతపురం సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను అనంతపురం సెబ్ సీఐ రవిచంద్ర గురువారం వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం అనంతపురంలోని తపోవనం సర్కిల్‌లో సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో టమాట తరలిస్తూ అటుగా వచ్చిన బొలెరో పికప్ వాహనాన్ని ఆపి పరిశీలించగా 100 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. దీనిపై ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు లోతైన దర్యాప్తు చేపట్టి కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున గౌడ్, బోయ రాజశేఖర్, రాంపల్లి నివాసి రమేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులు కర్ణాటకలోని నాగలమడక నుంచి 9,216 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను మారెళ్ల గ్రామానికి తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

మద్దికెర: స్థానిక రైల్వేస్టేషన్‌లో గతంలో మాదిరిగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు మల్లికార్జున రాజన్నయాదవ్ కోరారు. గురువారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాలులో ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రజారోగ్యం దృష్ట్యా రైళ్ల నిలుపుదలను రద్దు చేశారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గతంలో మాదిరిగా మద్దికెరలో రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సమితి చైర్మన్ చౌక్కా సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పింఛన్ల పెంపు

తుగ్గలి: ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్లను రూ.2,750కు పెంచి ఇస్తున్నారని వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి అన్నారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎద్దులదొడ్డిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు విజయభూపాల్‌రెడ్డితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కుల, మత, వర్గభేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వీఆర్వో కాశీరంగస్వామి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌రంగనాథ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎద్దులదొడ్డిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హొళగుంద: కంటి ఆపరేషన్ చేయించుకుని కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా రారావి గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటున్న వృద్ధురాలికి పింఛన్‌ను అందజేసి ఆపత్కాలంలో ఆదుకుంది నెరణికి గ్రామానికి చెందిన వలంటీర్ కాళమ్మ. నెరణికి గ్రామానికి చెందిన మాళమ్మ కొద్ది రోజుల క్రితం కంటి సమస్యతో బళ్లారి జిల్లా శిరుగుప్పలోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని రారావిలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ కాళమ్మ గురువారం రారావికి వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేశారు.


రారావిలో ఉంటున్న మాళమ్మకు పింఛను అందజేస్తున్న కాళమ్మ

ఆధార్ అనుసంధానం పకడ్బందీగా చేపట్టండి

హొళగుంద: మండలంలో ఆయా గ్రామాల్లో ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ హుసేన్‌సహేబ్ బీఎల్‌ఓలను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ దీప, ఆర్‌ఐ దినోజ్‌తో కలిసి బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 6బీలో ఓటరు ఐడీతో ఆధార్ లింక్, పీఎస్‌ఈ ప్రాసెస్, 2023 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరు జాబితాలో నమోదు, ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

తుగ్గలి: విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చి దిద్దుతోందని ఎంపీటీసీ సభ్యురాలు వనమాల పుష్పావతి అన్నారు. గురువారం మండల పరిధిలోని రామాపురం యూపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఆమె ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. నాడు–నేడుతో పాఠశాలలను ఆధునీకరించడంతో పాటు, ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో సీఎం జగనన్న ట్యాబ్‌లు అందిస్తున్నారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఆనంద్, పీఎంసీ చైర్మన్ బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధప్ప, గంగాధర్, గోవిందరాజులు, రంగస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సఫరున్నిసా బేగం సూచించారు. ఆమె గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలోని 5 అంగన్‌వాడీ కార్యకర్త, 9 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్యకర్త పోస్టులకు పదో తరగతి, ఆయా పోస్టులకు 7వ తరగతి విద్యార్హత ఉండాలని, వివాహమై స్థానికంగా ఉండే మహిళలు అర్హులని పేర్కొన్నారు.

ఆలూరు రూరల్: ఐసీడీసీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లోని అంగవాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లలిత గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఆలూరు మండల కేంద్రంలోని సెంటర్–3, అరికెర అంగన్‌వాడీ కేంద్రంలో ఒక ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆస్పరి మండలం చిరుమాన్ దొడ్డిలో ఒక కార్యకర్త, ముత్తుకూరులో ఒక ఆయా పోస్టు, చిప్పగిరి మండలంలోని గుమ్మనూరులో ఒక కార్యకర్త, ఏరూరు గ్రామంలో ఒక ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే హాలహర్వి మండలం నందు శ్రీధర్‌హాల్, అర్ధగేరి గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

కృష్ణగిరి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. పందిరపల్లె గ్రామానికి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఎస్సీ), ఆయా పోస్టులు లక్కసాగరం–బీసీ–బీ, అమకతాడు–1 ఓసీ, చిట్యాల–1 బీసీ–బీ, ఆగవేళి–ఓసీ, బాపనదొడ్డి–బీసీ–బీ ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

తుగ్గలి: మండలంలోని బొందిమడుగుల–1 అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), ఆయా పోస్టులు తుగ్గలి–3 (ఓసీ), జొన్నగిరి తండ (ఓసీ – ఈడబ్ల్యూఎస్), జొన్నగిరి–2 (ఎస్సీ) ఖాళీగా ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తు సీడీపీఓ సావిత్రి సూచించారు.

వెల్దుర్తి: మండల పరిధిలో ఖాళీగా ఉన్న 4 అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రాజెక్ట్ సీడీపీఓ షంషాద్ బేగం గురువారం తెలిపారు. పుల్లగుమ్మి–1 (బీసీ–బీ), మదార్‌పురం (బీసీ–డీ), మల్లెపల్లె–2 (ఈడబ్ల్యూఎస్), చెర్లకొత్తూరు–1 (ఎస్సీ)కి రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు


తేరు బజారులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 8వ తేదీన జరుగనున్న శ్రీ నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొంటున్నామని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ జయన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక తేరు బజారులో రథోత్సవం జరిగే ప్రాంతాలను వారు పరిశీలించారు. రథోత్సవం నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు మిద్దెలపై భక్తులు ఎక్కి రథోత్సవం వీక్షించడంపై నిఘా పెట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలని డీఎస్పీ సూచించారు. ఆలయం, రథోత్సవం వద్ద బారికెడ్ల ఏర్పాట్లపై పలు ఆదేశాలిచ్చారు. పట్టణ, రూరల్ సీఐలు మధుసుదన్ రావు, మంజునాథ్, మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఎస్‌ఐలు, ఆలయ ధర్మకర్తలు ఉన్నారు.